సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 21 । జూన్ । 2024



టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం
వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. వీటివల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని చెబుతున్నారు. -8లో



రాసలీలల సీఐ.. కోరిన చోటికి వేసేయ్!
ఆయనో సీఐ. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల బందోబస్తు డ్యూటీలో ఉన్న ఆయనగారి రాసలీలలు అప్పట్లో బహిర్గతమయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.690	రూ.830
రెండోరకం	రూ.500	రూ.720

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 690 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	520	520
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 141.220 కిలోలు



న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష
కలికిరి: జిల్లాలోని వెనుక బడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీకి సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. 6, 8వ తరగతుల అభ్యర్థులకు జరిగిన పరీక్షకు మొత్తం 598 మంది దరఖాస్తు చేసుకున్నారు.వారిలో 6వ తరగతికి 293 మంది, 8వ తరగతికి 181 మంది, మొత్తం 474 మంది హాజరయ్యారని తెలిపారు.124 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం
కడప రూరల్: అన్నమయ్య జిల్లా ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ కర్త ఎల్.మాధవిలత తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25లోపు సంబంధిత గురుకుల విద్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు. 27వ తేదీన స్కూల్ పరిధిలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న స్కూల్లోనే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచండి


ఫారంపాండ్ పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

పెద్దతిప్పసముద్రం: ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని రావూరివాండ్లపల్లి పంచాయతీలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను అకస్మికంగా తనిఖీ చేశారు.నాలుగు వారాల నుంచి బిల్లులు రాలేదని కూలీలు పీడీ దృష్టికి తీసుకు రాగా వారంలోగా డబ్బులు మంజూరవుతాయని ఆయన తెలిపారు. అనంతరం ఊట కుంటలు, పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ గడ్డి, పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ మధుబాబు, ఇంజనీర్ మహేష్, క్షేత్ర, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

25న జాబ్ మేళా
కడప ఎడ్యుకేషన్: కడప ఐటీఐ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ డీఎల్‌టిసి ఐటీఐలో ఈ నెల 25వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో బెంగళూరుకు చెందిన ఆటోమోటివ్ ఆక్సెలెస్ లిమిటెడ్, మైసూరుకు చెందిన ప్లాన్సి హైపర్మార్కెట్స్, కడపకు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్, ట్రియో విజన్, ఆల్ డిక్సన్, రేణిగుంటకు చెందిన అమరరాజా బాటరీస్, శ్రీసిటికి చెందిన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌లు, కడప పట్టణంలోని వివిధ ఆటో మొబైల్‌కి సంబంధించిన సర్వీస్ కంపెనీలో పాల్గొంటాయని చెప్పారు. ఐటీఐ చివరి సంవత్సరం చదువుతూ ఏఐటీటీ 2024 పరీక్షలు రాస్తున్న వాళ్లు, ఐటీఐ పాస్ అయిన విద్యార్థులు హాజరుకావచ్చని తెలిపారు. అర్హత ఉన్న వారు తమ రెజ్యూమ్‌తోపాటు విద్యార్హతల సర్టిఫికెట్స్(ఒక సెట్ జిరాక్ కాపీలు), ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ పుస్తకం, పాస్ పోర్టు సైజు ఫోటోలతో హాజరుకావాలని చెప్పారు.

టమాటా @ 100


సింహాద్రిపురం: రోజురోజుకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా టమాటా ధర నోటమాట రాకుండా చేస్తోంది. సెంచరీకి చేరువకు పరుగులు పెడుతోంది. వారం రోజుల క్రితం టమాటా ధర రూ.30ల నుంచి రూ.50లు పలికింది. ప్రస్తుతం టమోటా ధర ఏకంగా రూ.80ల నుంచి రూ.100లకు చేరింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సామాన్యులకు కూరగాయల ధరలు మోయలేని భారంగా మారిపోయాయి. ఇక కూరగాయలు కొనలేక ఆకుకూరలతో సరిపెట్టుకుందామంటే వాటి ధరలు కూడా మండిపోతున్నాయి. ఆకుకూరలు గతంలో రూ.10లకు మూడు కట్టలు ఇవ్వగా ఇప్పుడు రూ.10లకు ఒక కట్టమాత్రమే ఇస్తున్నారు. మరోవైపు మిర్చి ధర కూడా రూ.100లు ఉంది. ఉల్లికూడా ఘాటెక్కుతోంది. సకాలంలో వర్షాలు పడకపోవడం, అకాల వర్షంతో అక్కడక్కడ ఉన్న కూరగాయల సాగుపంట పాడవడంతో కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో చాలా వరకు గ్రామాల నుంచి పంట మార్కెట్‌కు రావడం ఆగిపోయింది. స్థానికంగా టమాటాలు దొరకకపోవడంతో టమాటా ధరలు అమాంతంగా పెరిగాయి.

ఆరోగ్య యోగం

- ఏకాగ్రత, దృఢచిత్తానికి తరుణోపాయం
- ఆరోగ్య సమస్యలకు అద్భుత పరిష్కారం
- ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



కురబలకోట: యోగా సాధన చేస్తున్న అభ్యాసకులు

మదనపల్లె సిటీ/కురబలకోట/రాజంపేట: ఉరుకుల, పరుగుల జీవితం మానవాళి ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది. శారీరక శ్రమ తగ్గిపోవడంతో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. మానసికంగా కుంగిపోతున్నారు. అటువంటి వారి ఆరోగ్యానికి యోగానే మహాభాగ్యం వంటిదని యోగా గురువులు సూచిస్తున్నారు. నిత్యం దైనందిక జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా సాధన ఎంతో ఉపయోగపడుతుందని చెబుతున్నారు. 2015 నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- మనుషులంతా యాంత్రిక జీవనానికి అలవాటు పడి శారీరక, మానసిక సమస్యలు, ఏకాగ్రత లోపంతో బాధపడుతున్న నేటి రోజుల్లో యోగా చేయడం వల్ల సత్ఫలితాలు ఉంటాయని ప్రముఖ వైద్యులు సైతం సూచిస్తున్నారు. నేటితరం విద్యార్థులు టీవీలు, సినిమాలు, సెల్‌ఫోన్ల కారణంగా ఏకాగ్రత కోల్పోయి నెగెటివ్ ఆలోచనల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కానీ యోగా సాధన ద్వారా విద్యార్థులు తమలోని నెగటివ్ ఆలోచనలను వదిలి పాజిటివ్ దృక్పథంతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని యోగా గురువులు పేర్కొంటున్నారు. యోగా వల్ల క్రమశిక్షణతో కూడిన జీవనం అలవడుతుంది. రోజు క్రమం తప్పకుండా తెల్లవారుజామునే నిద్రలేవడం, గంటపాటు యోగాసనాలు వేయడం వల్ల మంచి ఆలోచనా విధానం అలవడుతుంది

ప్రపంచాన్నే భయపెట్టిన ఒకే ఒక్కటి..
యావత్ ప్రపంచమంతా కరోనా మహమ్మారికి భయపడింది. దేశాధినేతలతో పాటు మహామహులు కలవరపడ్డారు. దీంతో ఆరోగ్యంపై జనం మరింత శ్రద్ధ వహించాల్సి వచ్చింది. కార్పొరేట్ సంస్థలు కూడా ఉద్యోగుల ఫిట్‌నెస్‌లో భాగంగా ఆరోగ్యం కోసం యోగా, వ్యాయామాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆసుపత్రుల మెట్లు ఎక్కకుండా మందులు, మాత్రలు వాడకుండా యోగాతో నిక్షేపంగా జీవితాన్ని సాగించవచ్చు. తీరకలేకుండా గడిపితే ఆరోగ్యం చెడి తర్వాత తీరిగ్గా ఆసుపత్రుల్లో కాలం గడపాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భవిష్యత్ తరాలు రోగాల బారిన పడకుండా విద్యార్థి దశ నుండే యోగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా ప్రోత్సహించాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు.

విస్తరిస్తున్న యోగా కేంద్రాలు:
మదనపల్లె పట్టణంలో యోగా కేంద్రాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. స్థానిక రెడ్డప్పనాయుడుకాలనీలో పూర్ణ యోగా సెంటర్, సుబ్బారెడ్డి లేవుట్‌లో సత్యసాయి యోగా సెంటర్‌తో పాటు పలువురు యోగాను ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

ఆసనాలు..ఉపయోగాలు
సుప్తగర్భాసనం: ఈ ఆసనం వల్ల కాళ్లు, చేతులు, నడుము భాగాలకు మంచి రక్తప్రసరణ జరిగి దృఢంగా మారుతాయి. అలాగే పొట్ట భాగంలోని కొవ్వుకూడా కరిగి సకల రోగాలు హరిస్తాయి.
ఏకపాదగ్రీవాసనం: దీనిద్వారా భుజభాగాలు, వక్షస్థలం శక్తివంతంగా తయారవుతాయి. కండరాలు పటిష్టంగా మారుతాయి.
అకర్ణధనుష్టంకారాసనం: ఈ ఆసనం ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. మెడ, నరాలు బలంగా తయారై చేతులు, కాళ్ళు ధృడంగా మారుతాయి.
మయూరాసనం: ఈ ఆసనం ద్వారా జీర్ణాశయం పనితీరు మెరుగుపడుతుంది. మధుమేహ వ్యాధి అదుపులో ఉంటుంది. మలబద్ధకాన్ని నిరోధించి మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది.
పద్మాసనం: ఈ ఆసనం వల్ల వెన్నెముకకు బలం చేకూరుతుంది. మోకాలి నొప్పులు తగ్గుతాయి. కాళ్ళకండరాలు శక్తివంతమవుతాయి.

ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ


యోగాసనాలు చేస్తున్న యోగా గురువు శిల్పా

మదనపల్లె పట్టణం రెడ్డీస్‌కాలనీకి చెందిన శిల్ప బెంగళూరులోని వివేకానంద యోగా అనుసాధన సంస్థలో ప్రత్యేక శిక్షణ పొందారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. పలు పాఠశాలల్లో యోగాపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు యోగాలో వివిధ రకాల అసనాలు నేర్పిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఆలిండియా కల్చర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2012లో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. యోగాలో ప్రత్యేక ప్రతిభ కనబరిచినందుకు అప్పటి తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఆరోగ్యం ఆనందం


ఆసక్తితోనే యోగాలో ఎంబీబీఎస్ (బీఎన్‌వైఎస్) చేశా. 18 ఏళ్లుగా దేశ విదేశాల్లో వేల మందికి శిక్షణ ఇచ్చా. థాయ్‌ల్యాండ్, సింగపూర్, హాంగ్‌కాంగ్, ఆస్ట్రేలియాలో ఎంతో మంది శిక్షణ తీసుకున్నారు. మనసు శరీరాన్ని ఏకం చేసేదే యోగా. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలంటే యోగాకు మించింది లేదు.
-పాల్ బ్రహ్మకుమార్, యోగా డాక్టర్, మదనపల్లె

ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది


యోగా అంటే శరీరాన్ని వంకరలు తిప్పడం కాదు. మనసు, శరీరం అనుసంధానం చేయడమే. మూడేళ్లుగా యోగాకు వెళ్తున్నా. మనిషి బతకడానికి ఆహారం ఎంత అవసరమో ఆరోగ్యంగా జీవించడానికి యోగా కూడా అవసరం. యోగా ద్వారా క్రమ శిక్షణ అలవడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేస్తుంది.
-కళ ఉదయ్, యోగ సాధకురాలు

మనసుకు స్నానం యోగా


శ్వాస ప్రక్రియతో మనస్సు ఉత్తేజమవుతుంది. జీర్ణక్రియను పెంచుతుంది. కండరాలు బలపడతాయి. శరీర కదలికలతో నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. కంటి చూపు మెరుగుపడుతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఏడేళ్లుగా యోగా చేస్తున్నా. ఉన్న వ్యాధులు క్రమేణా తగ్గిపోయాయి. శారీరక మాలిన్యాలను తొలగిస్తుంది. మనసుకు స్నానంలాంటిది యోగా. -ఆర్. రాఘువేంద్ర,అష్టాంగ యోగ సాధకులు

దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయి


ఆరోగ్య సమస్యలు లేకుండా సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయాలి. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగమైతే శరీరం, మనసు ఉల్లాసంగా ఉంటుంది. అందువల్ల అందరు ఏదో ఒక సమయంలో కనీసం ఒక గంటపాటు యోగసనాలు చేయాలి. యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయి.
- ఎస్.చంద్రమోహన్, యోగామాస్టర్, రాజంపేట

ఉత్సాహం చురుకుదనం


ఉత్సాహం చురుకుదనం ఉంటుంది. ఎనిమిదేళ్లుగా యోగా చేస్తున్నా. ఏళ్లుగా ఉన్న నొప్పులు ఆరునెలలకే పోయాయి. శరీరం, మనస్సు దృఢంగా ఉంటాయి. జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగు తుంది. శరీర భాగాలకు ఆక్సిజన్ బాగా అందుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. యోగా ఉన్న చోటుకు రోగాలు రాలేవు. జీవన ప్రమాణం పెరుగుతుంది.
-గిరి, యోగా సాధకలు

ఆరోగ్యకర జీవన శైలి సాధ్యం


ఏడేళ్లుగా క్రమంగా యోగా చేస్తున్నా. ఆసుపత్రి మెట్లు ఎక్కలేదు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో ఒత్తిడి ఎదుర్కొని ఉన్నతంగా జీవించడం యోగాతోనే సాధ్యం. ప్రతి రోజు గంట పాటు కేటాయించి యోగా చేస్తే అద్భుతాలు చూడవచ్చు. వయస్సును కూడా కట్టడి చేస్తుంది. బరువు నియంత్రణలో ఉంటుంది.
-ఎం. నాగరాజు, గిఫ్ట్ సెంటర్ నిర్వాహకులు

కడప రాయుడి సన్నిధిలో కలశారాధన
నేడు ముగింపు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావించే దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో విశేష కలశారాధన నిర్వహించారు. మూడు రోజుల సహస్ర కలశారాధన బుధవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైంది. అందులో భాగంగా గురువారం ఉదయం సహస్ర కలశాభివాసం, పారాయణలు నిర్వహించారు. సాయంత్రం టీటీడీ ఆగమ సలహాదారులు రాజేష్ భట్టర్ ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో దాదాపు 50 మందికి పైగా అర్చకులు, వేద పండితులు కలశాలను ఆలయ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. పుష్కరిణిలోని పవిత్ర జలాన్ని ఆ నవకలశాలలో నింపి మేళ తాళాలతో అట్టహాసంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. వాటితో సహస్ర కలశ వాహనారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని రంగ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై విశేష అలంకారంలో కొలువుదీర్చారు. శ్రీ చక్ర మండలారాధనతో అక్కడ ఏర్పాటు చేసిన హోమ గుండం వద్ద అగ్ని ప్రతిష్ఠ చేసి మూర్తి హోమాన్ని నిర్వహించారు. అర్చక బృందం సామూహికంగా లక్ష జపం నిర్వహించారు. స్థానిక భక్తులు, టీటీడీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం ఉదయం 7.00 గంటల నుంచి సహస్ర కలశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, అలంకారం, పేరియ శాత్తుమొర, తీర్థ ప్రసాదాల పంపిణీ, మహాశీర్వాదం నిర్వహిస్తారు. సాయంత్రం 5.00 గంటల నుంచి మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

బదిలీలకు పోరాటం

- జిల్లాలో పోస్టింగ్‌ల కోసం రాజకీయ పైరవీలు
- అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకుంటున్న యంత్రాంగం



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగియడం, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అప్పుడే అధికారులు బదిలీలపై ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చిన వారు, ఈ జిల్లా నుంచి వేరే జిల్లాలకు వెళ్లాలనుకునే వారు ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అనుకూలంగా ఉన్న అధికారులు కోరుకున్నచోట పోస్టింగ్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధికార పగ్గాలు చేపట్టి పది రోజులే అవుతున్నా ఎట్టకేలకు చోటా నేతలు అధికారులతో మాట్లాడుకుని బదిలీలు చేయించేందుకు పైరవీలు కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఈ వ్యవహారంపై చర్చలు జోరుగా కొనసాగుతున్నాయి.

నేతలను ప్రసన్నం చేసుకోవడంలో అధికారులు నిమగ్నం
కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో గెలిచిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను ప్రసన్నం చేసుకోవడంలో అధికారులు నిమగ్నమయ్యారు. తొలుత మంత్రితోపాటు ఎమ్మెల్యేల కార్యాలయాల వద్దకు వెళ్లి బొకేలు అందించి...సన్మానాలు చేయడం, తర్వాత ఫలానాశాఖ అంటూ పరిచయం చేసుకుంటున్నారు.ఇదే సందర్భంలో బదిలీ వ్యవహారాన్ని కూడా వారి చెవిన వేస్తున్నారు. ఎన్నికల విధుల కోసం అన్నమయ్య జిల్లాకు వచ్చిన పలువురు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర పోలీసులు తిరిగి ఆయా జిల్లాలకు వెళ్లాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు స్థానికంగానే ఉండేందుకు యత్నాలు మొదలు పెట్టారు.

కింది స్థాయి నేతల ద్వారా టచ్‌లోకి..
జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందడం...అధికారంలోకి తెలుగుదేశం పార్టీ రావడంతో అధికారులు బదిలీల కోసం కిందిస్థాయి నేతలతో టచ్‌లోకి వెళుతున్నారు. కోరుకున్న చోటికి పోస్టింగ్ ఇప్పించడం ద్వారా మాకు, మీకు ప్రయోజనమంటూ మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే పోలీసుశాఖలో ఎస్‌ఐలు, సీఐలతోపాటు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర పలు శాఖల్లోని అధికారులు, సిబ్బంది ఎవరికి వారు రాజకీయ పైరవీలను సాగిస్తున్నారు. దీంతో మండలస్థాయితోపాటు దిగువ శ్రేణి నాయకులు అధికారులతో మాట్లాడుకుని పైరవీలకు తెర తీస్తున్నారు. దీంతో నేతల కార్యాలయాల వద్ద అధికారుల హడావుడి కనిపిస్తోంది.

భవితకు సర్వే

- జిల్లా వ్యాప్తంగా గడప గడపకు భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు
- ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సర్వే
- 552 మంది చిన్నారుల గుర్తింపు



సర్వేను పరిశీలిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, సహిత విద్య అధికారులు

మదనపల్లె సిటీ: మానసిక దివ్యాంగ చిన్నారులను గుర్తించి, భవిత కేంద్రాల ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు చేపట్టిన సర్వే పూర్తయింది. ఈనెల తొమ్మిదో తేదీన పూర్తయిన సర్వేలో 552 మంది మానసిక దివ్యాంగులైన చిన్నారులను ఆయా భవిత కేంద్రాల ఐఈఆర్పీలు గుర్తించారు. సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య ద్వారా వీరికి విద్యాబుద్దులు నేర్పించడమే కాకుండా ప్రతి వారం ఫిజియోథెరఫీ సేవలు అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలువురు చిన్నారులను వారి తల్లిదండ్రులు భవిత కేంద్రాల్లో చేర్పించారు.తమ మండలాల పరిధిలో భవిత కేంద్రాలకు రాని మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించేందుకు మే ఒకటో తేదీ నుంచి భవిత కేంద్రాల ఐఈఆర్పీలు సర్వే చేపట్టారు. ఈ సర్వే ఈనెల తొమ్మిదో తేదీన పూర్తయిన సర్వేలో 552 మంది మానసిక దివ్యాంగులను గుర్తించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్స్‌లు
ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్స్‌లను అందజేస్తోంది. బడికి వచ్చే మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం ఉన్న వారికి, ఇంటి వద్ద ఉంటున్న వారికి, బాలికలకు అలవెన్స్‌లను ఇస్తున్నారు. బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్స్ కింద నెలకు రూ.200 చొప్పున పది నెలలకు ఒకసారి రూ.రెండు వేలు అందజేస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్టు అలవెన్స్ కింద నెలకు రూ.200 ,బాలికలకు ప్రత్యేకంగా (అదనం) గర్ల్ చైల్డ్ అలవెన్స్ కింద రూ.200, హోమ్ బెస్ట్ అలవెన్స్ కింద బడికి రాకుండా ఇంటి వద్దే ఉంటున్న ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2 వేలు ఇస్తున్నారు. బడికి వెళ్లే వారికి పాఠశాలల్లో అందరు విద్యార్థులతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ, టైలను అందజేస్తున్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి వారికి ఎటువంటి పరికరాలు అవసరమో గుర్తించి దరఖాస్తులు పూర్తి చేసి అవసరమైన పరికరాలను అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

జిల్లాలో 30 భవిత కేంద్రాలు
జిల్లా వ్యాప్తంగా 30 భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి పరిధిలో 545 మంది మానసిక దివ్యాంగులు,బుద్ధిమాంధ్యం గల విద్యార్థులు విద్యాబుద్దులు నేర్చుకుంటున్నారు. వారిలో అవసరమైన వారికి వారంలో ఒక రోజు ఫిజియోథెరఫిస్టు ఫిజియోథెరఫీ చేయిస్తున్నారు.

తల్లిదండ్రులను ప్రోత్సహించాలి


ప్రస్తుతం ప్రత్యేక అవసరాలగల పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్పీలు సత్ఫలితాలు సాధించారు. జిల్లా వ్యాప్తంగా 552 మంది మానసిక దివ్యాంగ చిన్నారులను గుర్తించారు. వారంతా అంగన్‌వాడీ కేంద్రాలకు, బడులకు, కళాశాలకు వెళ్లాల్సినవారు. వారిని చైతన్య పరిచి భవిత కేంద్రాలక రప్పించి విద్యాబుద్దులు నేర్పించేలా చూడాలన్నది లక్ష్యం. వారిని బడికి పంపేందుకు కొందరు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. వారికి ధైర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.
-జనార్థన్, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్

మండలం	సర్వేలో గుర్తించిన దివ్యాంగులు
బి.కొత్తకోట	23
చిన్నమండ్యం	16
చిట్వేలి	20
గాలివీడు	17
గుర్రంకొండ	27
కె.వి.పల్లి	12
కలకడ	20
కలికిరి	15
కురబలకోట	14
లక్కిరెడ్డిపల్లె	18
మదనపల్లె	23
ములకలచెరువు	26
నందలూరు	12
నిమ్మనపల్లె	13
ఓబులవారిపల్లె	24
పెద్దమండ్యం	14
పెనగలూరు	15
పీలేరు	16
పీటీఎం	16
పుల్లంపేట	21
రాజంపేట	21
రామాపురం	19
రామసముద్రం	13
రాయచోటి	29
రైల్వేకోడూరు	17
సంబేపల్లి	21
టి.సుండుపల్లి	17
తంబళ్లపల్లె	14
వాల్మీకిపురం	14
వీరబల్లి	25

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి


నారమాకులవడ్డిపల్లెలో బీసీజీ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

కేవీపల్లె: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీ పరిధిలో నారమాకులవడ్డిపల్లెలో నిర్వహించిన 104 వాహన సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో నిర్వహించిన వయోజన బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్నిమిట్ట పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కాన్పుల వివరాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో, ఆశా కార్యకర్తలు వారి గ్రామాల పరిధిలోని గర్భిణులకు అవసరమైన సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పు చేయించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హులందరికీ బీసీజీ టీకాలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చన, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, జిల్లా కార్యాలయ అధికారి లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది మైత్రిసుధ, అలేఖ్య, ఉమాదేవి, రమణ, స్వర్ణలత, 104 వాహన సిబ్బంది వెంకటరమణ, ధరణి, రెడ్డిమోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

13 తులాల బంగారు ఆభరణాల చోరీ

కడప అర్బన్ : మహిళ సంచిలో తెచ్చుకున్న 13 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలానికి చెందిన పి.ప్రమీల ఫిబ్రవరి 28న దేవుని కడప వద్ద బంధువుల వివాహానికి ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. దారిలో తాను తెచ్చుకున్న సంచి జిప్ తెరచి ఉండడంతో ఆందోళనగా తెరచి చూశారు. అందులో 13 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గమనించి బోరున విలపించారు. కడప వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హరిత హోటల్‌లో ఏసీ, గీజర్‌ల చోరీ

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిత టూరిజం హోటల్‌లో ఏసీ, ఔట్‌డోర్లు, గీజర్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీ చేశారు. కాల్వ నిర్మాణం ఉండడంతో సామగ్రి పక్కకు తీసి పెట్టారు. ఇది తెలుసుకున్న దుండగులు రూ.50వేల విలువైన వాటిని అపహరించుకెళ్లారు. హోటల్ మేనేజర్ మల్లికార్జున ఫిర్యాదుతో పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును డీకొన్న ఆటో

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి పరిధిలోని ఆటోను వేగంగా నడుపుతూ డ్రైవర్ చెట్టును డీకొనడంతో ఇద్దరికి గాయలయ్యాయి. ఎస్ఐ చిరంజీవి వివరాల మేరకు.. నలుగురు ప్రయాణికులు ఎర్రగుంట్ల నుంచి పోట్లదుర్తికి ఆటోలో బయలుదేరారు. పోట్లదుర్తి సమీపానికి రాగానే ఆటో అదుపుతప్పి చెట్టును డీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఒకరిని కర్నూలుకు, మరొకరిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొబైల్ ఫోన్ అప్పగింత



ఫోన్‌ను అందజేస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైలు ప్రయాణంలో ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అప్పగించి ఆర్‌పీఎఫ్ పోలీసులు భేష్ అనిపించారు. కడప ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు....జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఒక ప్రయాణీకుడు తన సెల్ ఫోన్ మరిచిపోగా విధుల్లో ఉన్న రైల్వే రక్షక దళం పోలీస్ ఆ మొబైల్‌ను గుర్తించి ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో భద్రపరిచారు. తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఓ ప్రయాణీకురాలు తన మొబైల్‌ను మరిచిపోయిందని తెలిసి తగిన ఆధారాలతో వచ్చి ఫోన్ తీసుకెళ్లాలని సూచించారు. బాధితులు గురువారం రావడంతో ఆర్‌పీఎఫ్ అధికారులు ఫోన్‌ను అందజేశారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డిలను ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు అభినందించారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ప్రతి బుధ, శని వారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వ ఆస్పత్రులలో సరిపడా నిల్వలు

కడప కోటిరెడ్డిసర్కిల్–ఎర్రగుంట్ల : వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి. గర్భిణిగా మొదలు కొని అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు, వ్యాక్సిన్లు వేయిస్తే వ్యాధులు దరి చేరవని వైద్యులు చైతన్యం చేస్తున్నారు. జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కలిగి ఉండాలి. అయితే చాలామంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై అవగాహన కొరవడడంతో వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వైద్యం చేయించుకునేందుకు డబ్బు వెచ్చించి ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

టీకా వేసేదిలా...

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలల తర్వాత టీటీ ఇంజెక్షన్ వేయించుకోవాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ వేస్తారు. వీటితోపాటు ఐరన్, ఫోలిక్, క్యాల్షియం ట్యాబ్లెట్లు ఇస్తారు. మహిళ ప్రసవానంతరం ఐరన్ ట్యాబెట్లు అందజేస్తారు.



ప్రకాశ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో టీకా వేయించేందుకు చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు

- 9 నెలల నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.
- అప్పుడు పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోస్ వేయించాలి. దీంతో పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. ఆరు నుంచి 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితోపాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయించాలి. కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చ కామెర్ల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి, మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఎ చుక్కలు వేయించాలి. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు, టీపీటీ, మీజిల్స్, విటమిన్–ఎ ఓపీని వేయించాలి.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు, 10–16 సంవత్సరాలు పూర్తయితే టెటనస్, టెక్సాయిడ్(టీటీ) వేయించాలి.

వ్యాధులపై అవగాహన



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ పి.కరుణాకర్, చిన్న పిల్లల వ్యాధి నిపుణులు, రిమ్స్, కడప

టీకాలు తప్పనిసరి...



తల్లిదండ్రులు తమ పిల్లలకు వేళకు తప్పకుండా టీకాలు వేయించాలి. విటమిన్ఏ డోస్, హెపటైటిస్–బి డోస్‌లు పీహెచ్‌సీలలో వేస్తారు. వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. వ్యాధుల బారిన పడి ఆర్థికంగా చితికిపోకుండా ఉండవచ్చు. దీనిపై పల్లెల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, వైద్యాధికారి, ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ సెంటర్

యువతను చైతన్యం చేస్తాం

ఎస్ఐఓ రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ జమీర్ ఖాన్

ప్రొద్దుటూరు కల్చరల్: యువతను చైతన్య పరచడానికి స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నట్లు ఎస్ఐఓ రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ జమీర్ ఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురు వారం సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోరల్ లివింగ్ ట్రాన్స్‌ఫార్మింగ్ సెల్ఫ్ అండ్ సొసైటీ పేరుతో జూలై 20వతేదీ వరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, బెట్టింగ్, ధూమపానం, మద్యపానంతో తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటి నుంచి బయట పడేందుకు, అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ పట్టణాధ్యక్షుడు ఆదిల్ ఖాన్, ఎజాజ్, అబ్దుల్, ముసావిర్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐఓ ప్రతినిధులు

స్థల వివాదమే ఆత్మహత్యకు కారణం



జిల్లా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

- రహదారిపై రమేష్‌బాబు కుటుంబ సభ్యులు ఆందోళన
- మోసం చేసిన వారిపై చర్యలకు చేనేత కార్మికుల డిమాండ్

మదనపల్లె : అంగళ్లు మల్లయ్యకొండ సమీపంలో ఆత్మహత్య చేసుకున్న రామిశెట్టి రమేష్‌బాబు మృతికి అప్పులు కారణం కాదు.. మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు ఇంటి స్థలం విషయంలో మోసం చేయడమే కారణమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సూసైడ్‌నోట్ ఆధారంగా ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె జిల్లా ఆస్పత్రి ఎదుట రహదారిపై గురువారం చేనేతలతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. వన్‌టౌన్ ఎస్ఐ వలీబాషు బాధిత కుటుంబీకులతో మాట్లాడి ధర్నా విరమించాలని కోరారు. తమకు న్యాయం జరిగేంత వరకు కదిలేది లేదని వారు భీష్మించడంతో న్యాయం చేస్తామంటూ ఒప్పించి అందరినీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రమేష్‌బాబు భార్య రామిశెట్టి సుశీల మాట్లాడుతూ...తన భర్త వెంకటేష్...కోళ్ల బైలు పంచాయతీలో సర్వే నెం.605–2బిలో కష్టార్జితంతో ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారన్నారు. ఈ స్థలానికి సంబంధించి పురాణం చంద్ర శేఖర్, పురాణం రత్నకుమార్, శివారెడ్డి, వెంకటేష్, చంద్ర, శిబ్యాలప్రసాద్, శ్రీకాంత్, తదితరులు ఆ భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుని బెదిరించారని తెలిపారు. నకిలీ మిలిటరీ పట్టా సహాయంతో భూమి తమదేనని, ఎవ్వరికీ హక్కు లేదని స్థలం కబ్జా చేశారన్నారు. ఓవైపు డబ్బు పోగొట్టుకోవడం, స్థలం తనకు దక్కకపోవడంతో మానసికంగా కుంగిపోయి తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సూసైడ్‌నోట్‌లో పేర్కొన్న వారందరిపై కేసు నమోదు చేయాలని ఆమె కోరారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

సుండుపల్లె : అన్నమయ్య జిల్లా రాయవరం అటవీ ప్రాంతంలో కారుతోపాటు 13 ఎర్ర చందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆదేశాలతో డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బృందాలు అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలో గురువారం కూంబింగ్ చేపట్టాయి. రాయవరం అటవీ ప్రాంతంలోని సుండుపల్లి ఫారెస్టు బీట్ పరిధిలో గంగోత్రి రస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కెవి.కుప్పానికి చెందిన శరత్ కుమార్ రవి(23), ఆనైకట్టు తాలుకాకు చెందిన దేవరాజ్ గోవిందస్వామి(27), మరొకరు రెండు మోటారు సైకిళ్లలో వస్తూ సిబ్బందిని చూచి పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని పట్టుకోగా, వారిని అనుసరిస్తూ వచ్చిన కారును ఆపేసి కొందరు పరారయ్యారు. కారులో 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారితోపాటు మరో 12మంది స్మగ్లర్లు ఉన్నట్లు పట్టుపడిన వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ కుమార్ తెలిపారు.



టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో నిందితులు, దుంగలు

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన రెడ్డప్ప

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీకి చెందిన కె.రెడ్డప్ప(45) చౌడేశ్వరి కళ్యాణమండపం వద్ద కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అమ్మచెరువుమిట్ట వద్ద పెట్రోల్ నింపుకుని వస్తున్నాడు. సర్కార్‌తోపునకు చెందిన మౌలాలి మరో వాహనంలో వేగంగా వచ్చి తన వాహనాన్ని ఢీకొనడంతో రెడ్డప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సీటీఎం పంచాయతీ గంగాపురానికి చెందిన రెడ్డప్ప కుమారుడు జయకృష్ణ(19), శివకుమార్ (19), భాస్కర కుమారుడు పి.చరణ్(19) ముగ్గురు ద్విచక్ర వాహనంలో వస్తుండగా సీటీఎం క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జయకృష్ణ తీవ్ర గాయాలవగా, శివకుమార్, చరణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అలాగే అంకిశెట్టిపల్లెకు చెందిన కె.రమేష్(48) తన బంధువు ప్రశాంత్‌కుమార్‌తో కలిసి బుధవారం రాత్రి మదనపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కొత్తపల్లి సమీపంలో రామసముద్రం వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో రమేష్ తీవ్రంగా గాయపడగా తిరుపతి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మద్యం తాగి కత్తితో దాడి

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ పార్క్ సమీపంలో జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. నగరంలోని ఎర్రముక్కపల్లి నుంచి రైల్వే గేట్ మార్గంలో షేక్ మస్తాన్, గణేష్, ఓబులేసు మద్యం తాగారు. కర్రీస్ కోసం రాజీవ్ పార్క్ వైపు మోటార్ సైకిల్‌పై వచ్చారు. గతంలో మనస్పర్థలుండడంతో అక్కడ కనిపించిన విష్ణువర్ధన్, నాని, నరసింహాచారిలు వారితో ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తులైన విష్ణువర్ధన్, నరసింహాచారి కలిసి గణేష్, ఓబులేసు, మస్తాన్‌లపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. వీరంతా గతంలోనూ ఒకరినొకరు ఘర్షణపడినట్లు సమాచారం. కడప వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. నిందితులలో విష్ణువర్ధన్, నరసింహాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బాధితులలో ఒకరైన షేక్ మస్తాన్ ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




గణేష్‌కు రిమ్స్‌లో సేవలందిస్తున్న వైద్యులు

ఘాట్‌లో కారు ప్రమాదం

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్ రేణిమాను మలుపు ఘాట్ రోడ్డుపై బుధవారం రాత్రి కారు ప్రమాదానికి గురైంది. గుర్తుతెలియని కారులో పర్యాటకులు కొండపైకి వస్తుండగా అధిక వేగం అదుపు చేయలేక డ్రైవర్ పిట్ట గోడను ఢీకొన్నారు. కారు ఘాట్ రోడ్డు వైపునకు దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో కారులో ఎందరున్నారు, ఎక్కడి నుంచి వస్తున్నారనే వివరాలు తెలియరాలేదు. కారు విడి భాగాలు రోడ్డుపై పడ్డాయి. ప్రమాదం తర్వాత పర్యాటకులు వెనక్కు వెళ్లినట్లు తెలుస్తోంది.

రాసలీలల సీఐ.. కోరిన చోటికి వేసేయ్!

- చిన్నచౌక్ సీఐగా వివాదాస్పద అధికారి
- తిరుమల కేంద్రంగా ఐదేళ్ల క్రితం రాసలీల బహిర్గతం
- నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో సస్పెన్షన్ వేటు
- నేడు మళ్లీ అదే ప్రభుత్వంలో నియామక ఉత్తర్వులు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఆయనో సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ప్రజల మాన ప్రాణాలకు రక్షణగా నిలవాల్సిన అధికారి. బాధ్యతాయుత పోలీసు అధికారిగా ఉండి.. న్యాయం కోసం తనను ఆశ్రయించిన ఓ యువతిని లొంగదీసుకునేందుకు విఫలయత్నం చేశారు. తన లా మరో ఆడకూతురు వేధింపులు భరించరాదని ఆ యువతి మహిళా సంఘాలను, మీడియాను ఆశ్రయించింది. దేవదేవుడు శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల బందోబస్తు డ్యూటీలో ఉన్న ఆయన గారి రాసలీలలు అప్పట్లో ఒక్కమారుగా తిరుమల కేంద్రంగా బహిర్గతమయ్యాయి. పోలీసు వ్యవస్థకే మచ్చ తెచ్చిన అలాంటి సీఐ తాజాగా కడప చిన్నచౌక్ సర్కిల్ అధికారిగా నియమితులయ్యారు. పోలీసు అధికారి వ్యవహార శైలితో మాకేంటి.. కోరిన చోటికి వేసెయ్యడమే మా పని అన్నట్లు తాను కోరిన చోటికి సీఐని నియమంచి మరీ అధికార పార్టీ నేతలు తమ నైజాన్ని చాటుకున్నారు.

తేజమూర్తి.. ఐదేళ్ల క్రితం ఆ పేరు రాష్ట్రంలో మారుమోగింది. సంచలనం రేకెత్తిస్తూ మీడియాలో ఆడియో రికార్డింగ్ హోరెత్తింది. తిరుమల బ్రహ్మోత్సవాల డ్యూటీలో ఉంటూ ఓ యువతిని త్వరగా తిరుమలకు రావాలంటూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన ఐదు నిమిషాల సంభాషణల ఆడియో మీడియా చానళ్లల్లో హల్‌చల్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అప్పటి టీడీపీ సర్కార్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి ఇప్పటి చంద్రబాబు సర్కార్ తాజాగా ఆయనను కడప చిన్నచౌక్ సీఐగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ..

వాయల్పాడు సీఐగా తేజమూర్తి విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఐదేళ్ల క్రితం ఓ యువతి భార్యాభర్తల మధ్య వివాదం కేసుకు సంబంధించి పోలీసులను ఆశ్రయించింది. అప్పట్లో ఆ యువతితో సదరు సీఐ పరిచయం పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల బందోబస్తుకు తిరుమలకు వెళ్లారు. అదే క్రమంలో తాను తిరుమలలో బందోబస్తు డ్యూటీలో ఉన్నాను. ఇక్కడ ప్రత్యేక గది సిద్ధం చేశాను త్వరగా తిరుమలకు రావాలంటూ బాధిత యువతికి ఫోన్ చేశాడు. దీంతో ఖంగుతిన్న ఆ యువతి వెంటనే ఈ విషయాన్ని మీడియా ద్వారా బహిర్గతం చేసింది. ఈ సంఘటన సంచలనం సృష్టించడంతో సీఐపై వెంటనే సస్పెన్షన్ వేటు వేశారు.

మహిళా హోంమంత్రి నాయకత్వంలో...

రాష్ట్ర హోంమంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టారు. కడప ఎమ్మెల్యేగా రెడ్డెప్పగారి మాధవీరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మహిళా ప్రజాప్రతినిధి ఉన్న కడపలో వివాదాస్పద అధికారిగా ముద్రపడిన తేజమూర్తిని చిన్నచౌక్ సీఐగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయం కోసం ఆశ్రయించిన యువతిని లైంగికంగా లొంగదీసుకునే ప్రయత్నం చేసిన పోలీసు అధికారిని కడపలో నియమించడం వెనుక అధికారి పార్టీ నేత ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. వైఎస్సార్ జిల్లాలో పలు సర్కిళ్లకు ఏరికోరి వివాదాస్పద అధికారులను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది.

నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించే అధికారులను తెచ్చుకుంటే ఏకపక్షంగా వ్యవహరించరనే ఉద్దేశమే ప్రధాన కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అధికారి ఎవరైనా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు వస్తాయన్న వాస్తవాన్ని తెలుగు తమ్ముళ్లు విస్మరిస్తుండడం గమనార్హం.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన హరికృష్ణ(30) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు తిరుపతి ఆస్పత్రికి తరలించారు.

మద్యం సీసాలు ధ్వంసం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్, వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్లు, రాజుపాళెం స్టేషన్ పరిధిలో 98 కేసుల్లో సీజ్ చేసిన మద్యం సీసాలను గురువారం పట్టణ శివారులో ధ్వంసం చేశారు. కడప సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసులు నాయుడు సమక్షంలో 2,893 మద్యం సీసాలు ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, సెబ్ సీఐ మహేశ్‌కుమార్, రాజుపాళెం ఎస్ఐ పాల్గొన్నారు.

శ్రీకాంత్‌రెడ్డి పరామర్శ



బాషాను పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : టీడీపీ వర్గీయుల దాడిలో కత్తిపోట్లకు గురైన కౌన్సిలర్ భర్త ఇర్ఫాన్ బాషాను మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కడప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాషా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కత్తితో పొడవడం దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎదుర్కొంటామన్నారు. బాధిత కౌన్సిలర్ కుటుంబానికి తోడుగా నిలుస్తామని నాయన భరోసా ఇచ్చారు.

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

ఒంటిమిట్ట: మండలంలోని చెర్లోపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరానికి చెందిన ఆరుగురు 6 స్కార్పియో వాహనంలో తిరమలకు వెళ్లారు. స్వామిని దర్శించుకొని తిరిగి వస్తుండగా చెర్లోపల్లి క్రాస్ రోడ్డు వద్ద కడప నుంచి రేణిగుంటకు వెళ్తున్న లారీ ఢీకొంది. కారులో వస్తున్న వెంకట నారాయణ42), సాయిప్రజీత్ (13), అనుశ్రీ(13)లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని వారిని 108 వాహనం ద్వారా కడప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సమాజంలో అందరూ సమానమే

కడప రూరల్ : సమాజంలో అందరూ సమానమేనని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ అన్నారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా సంస్థ సహకారంతో హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్లకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల హక్కులు, విధులు తెలుసుకోవాలని, న్యాయ సంబంధమైన వ్యాజ్యాల కొరకు ఉచిత సలహా సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగాం అధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో రూ.3.30 లక్షల అపహరణ

చాపాడు : మండలంలోని చాపాడు ప్రభుత్వ మద్యం దుకాణంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు రూ.3.3లక్షల నగదు దోచుకెళ్లారు. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం రాత్రి తొమ్మిది గంటల తర్వాత దుకాణంలో పనిచేసే సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్ మద్యం లెక్కలు చూసుకుని నగదు క్యాష్ బాక్స్‌లో పెట్టి వెళ్లారు. నైట్ వాచ్‌మెన్లు కాపలా ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మద్యం దుకాణం తెరిచి చూసి.. నగదు చోరీ అయినట్లు గుర్తించారు. షాపు పైభాగంలో రేకులు తొలగించిన దుండగులు క్యాస్ బాక్స్ ఎత్తు కెళ్లారు. అందులో రూ.3.30 లక్షల నగదు ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. గురువారం సాయంత్రం సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీట్ అక్రమాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



బాలికల కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రాయచోటి అర్బన్ : నీట్, యూజీసీ నెట్ పరీక్ష పత్రాల లీకేజీపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తులచే విచారణ జరిపించి బాధ్యులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ స్థానిక బాలిక జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. నరసింహ మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో పెద్దఎత్తున అక్రమాలు జరిగినా, మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని నోటీసులు జారీచేయడంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరరించారన్నారు. వెంటనే దోషులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజులు, మదనమోహన్‌రెడ్డి, గణేష్, సమీర్, మౌలా, విద్యార్థినులు పాల్గొన్నారు.